


# ఈకాలం
THE HONEST TELUGU DAILY




సోమవారం 02-02-2026 | పేజీలు : 4 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :95 | ప్రచురణ: తెలంగాణ | ఎడిటర్ : దేవేందర్ నూకల

# రీఫామ్ ఎక్స్‌ప్రెస్‌కు..

## కొత్త శక్తినిచ్చిన బడ్జెట్: ప్రధాని మోదీ



కేంద్ర బడ్జెట్ 2026-27 పై ప్రధాని మోదీ స్పందించారు. ఈ పద్దు 140 కోట్ల మంది ఆకాంక్షలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. ఇది సంస్కరణల ప్రయాణాన్ని బలోపేతం చేస్తుందని వ్యాఖ్యానించారు. మూలధన వ్యయానికి, వృద్ధికి మధ్య సమతూకం పాటించారని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై ప్రశంసలు కురిపించారు. వికసిత్ భారత్ నిర్మాణానికి మార్గనిర్దేశనం చేస్తుందని, ఇది చరిత్రాత్మక బడ్జెట్ అని కొనియాడారు. "బడ్జెట్‌లో ఆత్మనిర్భర్ భారత్‌కు కేటాయింపులు చేశారు. 2047 మిషన్ లక్ష్యాల అనుగుణంగా ఈ బడ్జెట్ ఉంది. త్వరలో ఇండియా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుంది" అని చెప్పారు.
ప్రభుత్వ సంస్కరణల అజెండాను రీఫామ్ ఎక్స్‌ప్రెస్‌గా పిలిచిన మోదీ .. ఆ ఎక్స్‌ప్రెస్‌కు బడ్జెట్ కొత్త శక్తిని అందించిందని పేర్కొన్నారు. ఈ సంస్కరణలు యువతకు అద్భుతమైన అవకాశాలు కల్పిస్తాయన్నారు. భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మాత్రమే ఉండిపోవాలని భారతీయులు అనుకోవడం లేదని, సాధ్యమైనంత వేగంగా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఇక ఈ పద్దు మహిళా సాధికారతకు నిదర్శనంగా ఉందని, వరుసగా తొమ్మిదిసార్లు దీనిని లోక్‌సభలో ప్రవేశపెట్టి నిర్మలాసీతారామన్ రికార్డు సృష్టించారని ప్రధాని మోదీ కొనియాడారు.

## బడ్జెట్ తర్వాత 30 మంది విద్యార్థులను కలవనున్న నిర్మలమ్మ..

కేంద్ర ప్రభుత్వం 2026-27 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ను ఆదివారం పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది. ఉదయం 11 గంటలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బడ్జెట్‌ను లోక్‌సభకు సమర్పించనున్నారు. ఈ నేపథ్యంలో బడ్జెట్ విధి విధానాలు, రూపకల్పన విషయాలను తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కొంతమంది విద్యార్థులకు అవకాశం కల్పించినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఇందుకోసం దేశవ్యాప్తంగా ఉన్న వివిధ కళాశాలల నుంచి 30 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపాయి. 2లో..



# టెక్ కంపెనీలకు గుడ్‌న్యూస్..
# 2047 వరకు 'ట్యాక్స్ హాలిడే'



దిల్లీ: కృత్రిమ మేధ, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో భారత్‌ను ప్రపంచ హబ్‌గా మార్చేందుకు కేంద్ర బడ్జెట్ లో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కీలక ప్రతిపాదనలు చేశారు. భారత్‌లోని డేటా సెంటర్లను వాడుకొని ప్రపంచ వ్యాప్తంగా క్లౌడ్ సేవలు అందించే విదేశీ కంపెనీలకు 2047 వరకు 'ట్యాక్స్ హాలిడే'ను ప్రతిపాదించారు. ఈ ప్రకటన.. దేశీయంగా డేటా సెంటర్ల ఏర్పాటును వేగవంతం చేయడంతో పాటు క్లౌడ్ కంప్యూటింగ్‌కు భారత్‌ను ఎగుమతి హబ్‌గా మార్చనుంది. ఉపాధి అవకాశాలకు కూడా ఊతమివ్వనుంది. 2లో..

## వేంకటేశ్వరస్వామితో పెట్టుకుంటే ఈ జన్మలోనే అనుభవిస్తారు: చంద్రబాబు

- పవిత్రత కాపాడటమే లక్ష్యం: బాధ్యతలు చేపట్టిన వెంటనే తిరుమల పవిత్రతను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టామని, అందులో భాగంగానే సమర్థులైన అధికారులను నియమించామని తెలిపారు.
- కల్తీ నెయ్యి వివాదం: ఎన్‌డీడీబీ నివేదికలో జంతు కొవ్వులు ఉన్నాయని తేలిన తర్వాతే తాను ఆ విషయంపై మాట్లాడానని స్పష్టం చేశారు.

2లో..

## కేంద్ర బడ్జెట్‌తో ఆంధ్రప్రదేశ్‌కు గణనీయమైన మేలు: మంత్రి లోకేశ్



2లో..

# బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం..

## ఎంపీలంతా కేంద్రంపై ఒత్తిడి పెంచాలి: భట్టి



- రీజినల్ మెడికల్ హబ్‌ల జాబితాలో తెలంగాణ పేరు లేకపోవడం.
- యునెస్కో గుర్తించిన రామప్ప దేవాలయం, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సమ్మక్క-సారలమ్మ జాతరకు నిధులు కేటాయించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.
- విఫలమైన విన్నపాలు: సీఎం రేవంత్ రెడ్డితో కలిసి అనేకసార్లు ప్రధానిని, కేంద్ర మంత్రులను కలిసి విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని అన్నారు.
- ఎంపీలకు పిలుపు: రాష్ట్రానికి జరిగిన ఈ అన్యాయంపై రాజకీయాలకు అతీతంగా తెలంగాణ ఎంపీలందరూ కలిసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

హైదరాబాద్: కేంద్ర బడ్జెట్ తెలంగాణను నిరాశకు గురి చేసిందని ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈసారి బడ్జెట్‌లో ఆశించిన మేరకు కేటాయింపులు ఉంటాయని భావించినా.. ఈ ఏడాది కూడా అదే జరిగిందని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డితో సహా మంత్రులంతా.. ఎంపీల బృందంతో ప్రధానిని, కేంద్ర మంత్రులను అనేక సార్లు కలిశామని అయినా ప్రయోజనం లేదని విమర్శించారు. మూసీ, రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణలకు బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని ఆశించామన్నారు. బయోఫార్మాపై ఫోకస్ చేశారని.. 2లో..

# తెలంగాణకు 3 హైస్పీడ్ రైళ్లు..

## మెట్రో గురించి ప్రత్యేకంగా ఉండదు: కిషన్ రెడ్డి



దిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ముందుకు తీసుకెళ్లేలా బడ్జెట్ రూపకల్పన చేశారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. కేంద్ర బడ్జెట్‌పై ఆయన దిల్లీలో విలేకర్లతో మాట్లాడారు. రైతులకు అండగా నిలిచేందుకు ఎరువుల రాయితీని కేంద్ర ప్రభుత్వం పెంచిందని చెప్పారు. ఎరువులపై రాయితీ వల్ల తెలంగాణ రైతులు కూడా లబ్ధి పొందుతారని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ గతేడాది కంటే ఈసారి పెరిగిందన్నారు. 2లో..

# ఫోన్ ట్యాపింగ్ కేసు..

## నాలుగున్నర గంటల పాటు కేసీఆర్‌ను ప్రశ్నించిన సిట్





హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సిట్ విచారణ ముగిసింది. హైదరాబాద్ నందినగర్‌లోని ఆయన నివాసంలో నాలుగున్నర గంటలకు పైగా సిట్ అధికారులు ప్రశ్నించారు. కేసీఆర్ విచాణను సిట్ అధికారులు ఆడియో, వీడియో రికార్డు చేశారు. విచారణ అనంతరం నందినగర్ నుంచి సిట్ అధికారులు వెళ్లిపోయారు. నందినగర్‌లోని కేసీఆర్ ఇంటి వద్దకు బీఆర్ఎస్ నేతలు భారీగా చేరుకున్నారు. బాల్కనీలో నిలబడి పార్టీ శ్రేణులకు కేసీఆర్ అభివాదం చేశారు. అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల గురించి ప్రస్తావించారు. పార్టీకి క్షేత్రస్థాయిలో చాలా బాగా ఉందన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో కేసీఆర్ సమావేశమయ్యారు.

- త్వరగా నిద్రపోవడం, యోగా, వ్యాయామం, మరియు ఉదయం నడక.
- మట్టి కుండ నీరు తాగడం, ఆహారాన్ని నమిలి తినడం.
- నవ్వు, మౌనం, సంతృప్తి, మరియు సానుకూల దృక్పథం.
- నిస్వార్థ ప్రేమ, ఇతరులకు సహాయం చేయడం మరియు కుటుంబంతో సమయం గడపడం.

# ఏపీకి కేటాయింపులు..

## నిర్మలమ్మ బడ్జెట్ భేష్: రామ్మోహన్ నాయుడు



దిల్లీ: వరుసగా తొమ్మిదోసారి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్ దేశాభివృద్ధి, ఆర్థిక క్రమశిక్షణ, మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్యం, రైతులు, యువత మీద ప్రత్యేక దృష్టి పెట్టారని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై ప్రశంసలు కురిపిస్తూ ప్రకటన విడుదల చేశారు. విదేశీ యాత్రలపై పన్ను తగ్గింపు.. పౌర విమానయాన రంగానికి మరింత ఊతమిస్తుందని తెలిపారు. ప్రధాన మంత్రి వికసిత్ భారత్ లక్ష్యాలను మరింత వేగంగా చేరుకునేందుకు ఇది దోహదపడుతుందని అన్నారు. పౌర విమానాల విడిభాగాలపై పన్ను తగ్గించడంతో పాటు, శ్రీకాకుళం జిల్లాలో ప్రధాన పంటగా ఉన్న కొబ్బరి కోలుకునేలా తోడ్పాటు అందివ్వడం శుభపరిణామం అన్నారు.నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ స్థిరమైన ఆర్థిక విధానంతో పాటు పెట్టుబడులు, సంస్కరణలపై బలమైన దృష్టి పెట్టడం ద్వారా, భారతదేశానికి మరింత ప్రగతిని,

# సంపాదకీయం

చేసింది మహాపచారం!

ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నిప్పుతో చెలగాటం ఆడుతున్నారా తమ రాజకీయ ప్రత్యర్థులను సెంటిమెంటుతో కూడిన అంశాలపై టచ్ చేస్తూ తుచ్ఛమైన రాజకీయ ప్రయోజనాల కోసం ధర్మానికి, న్యాయానికి ప్రతీకలమని చెప్పుకొంటున్న మాజీ ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్మోహన్‌రెడ్డిలపై నిందలు వేస్తున్నారా నీతి నిజాయతీలకు తాము నిలువెత్తు నిదర్శనమని భావించుకునే ఈ ఇరువురితో పెట్టుకొని సమస్యలు కొనితెచ్చుకుంటున్నారా ఈ ప్రశ్నలకు సమాధానం అంత ఈజీగా లభించదు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి-- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మధ్య ముదురుతున్న జగడం విషయానికి వద్దాం. టెలిఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడంతో తెలంగాణ రాజకీయాలు వేడెక్కాయి. కేసీఆర్‌ను విచారణకు పిలవడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేయడమేనని భారత రాష్ట్ర సమితి నాయకులు మండిపడుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ ఏమి చేసినా అది లోక కల్యాణం కోసమేనని బీఆర్ఎస్ నాయకులు బలంగా నమ్మారు. ప్రజలను నమ్మింపజూశారు. ఎందుకంటే కేసీఆర్, జగన్‌రెడ్డిల రాజకీయ ఎత్తుగడలు సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా ఉంటాయి. తమ సమస్యలను ప్రజల సమస్యలుగా చిత్రీకరిస్తారు. శిఖర సమానులుగా తాము భావించే కేసీఆర్‌కు విచారణల పేరిట నోటీసులు ఇచ్చే సాహసాన్ని అంగుష్ఠ మాత్రుడైన రేవంత్‌రెడ్డి చేయడం ఏమిటి అని వారు ప్రశ్నిస్తున్నారు. కేసీఆర్ అంటే తెలంగాణ.. తెలంగాణ అంటే కేసీఆర్ అనే వాస్తవాన్ని విస్మరించి ఆయననే విచారిస్తారా ఎంత ధైర్యం అంటూ మండిపడుతున్నారు. ఆత్మగౌరవం కేసీఆర్ అండ్ కోకు మాత్రమే ఉంటుందా తెలంగాణ కోసం గతంలో కొట్లాడిన వారికి ఉండదా అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పులపై విచారణ చేయకూడదా కేసీఆర్ అండ్ కోకు కష్టం నష్టం జరిగితే తెలంగాణ సమాజం మొత్తానికి కష్టం వచ్చినట్టేనా ఇదెక్కడి వింత వాదన అని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. కేసీఆర్‌ను విచారణకు పిలవడం ఇదే మొదటిసారి కాదు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు ఏర్పాటైన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గతంలో ఆయనను విచారణకు పిలిచింది. అప్పుడు తెలంగాణ సమాజం ఉలిక్కిపడలేదు. కేసీఆర్‌కు సంఘీభావంగా రోడ్డు మీదకు రాలేదు. తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌కు ఈ కష్టం ఏమిటని ఆత్మ బలిదానాలకు సిద్ధపడలేదు. ఆ తర్వాత జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, అనంతరం జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కూడా ప్రజలు కాంగ్రెస్‌కే పట్టం కట్టారు. దీంతో తెలంగాణ సెంటిమెంటును మళ్లీ రగిలించాల్సిన అవసరాన్ని బీఆర్ఎస్ నాయకులు గుర్తించారు. ఏ చిన్న అవకాశం లభించినా ఆ దిశగా ఎత్తులు వేశారు. ఇప్పుడు టెలిఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు రావలసిందిగా కేసీఆర్‌కు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావును ఇదే కేసు విషయమై ఇదివరకే విచారించారు. ఇప్పుడు కేసీఆర్ వంతు వచ్చింది. ఇప్పుడు కూడా తెలంగాణ సెంటిమెంటును రగిలించకపోతే మునిగిపోతామని భావిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కేసీఆర్‌ను టచ్ చేయడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేయడమేననే పల్లవిని అందుకున్నారు.

కేసీఆర్ అంటే ఏమనుకుంటున్నారు శిఖర సమానుడైన ఆయనను విచారణకు పిలవడం ఏమిటి అని బీఆర్ఎస్ నాయకులు విమర్శలు సంధిస్తున్నారు. అయితే చట్టానికి ఎవరూ అతీతులు కారనుకోండి! అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ అండ్ కో కూడా ఈ మాటలు వాడేవారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు టెలిఫోన్ ట్యాపింగ్ జరిగిందా లేదా అంటే జరిగిందన్న విషయం బహిరంగ రహస్యం. కర్ణాటకలో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడుతోందని తప్పుబడుతూ కేసీఆర్ సొంత పత్రికలో శుక్రవారంనాడు ఒక కథనాన్ని ప్రచురించారు. ఫోన్ ట్యాపింగ్ కేసీఆర్ హయాంలో జరిగినంత మాత్రాన అందుకు కేసీఆర్ ఎలా బాధ్యుడవుతారని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. నిజమే, ఫలానా వారి ఫోన్లు ట్యాప్ చేయాలని ఏ ముఖ్యమంత్రి కూడా ఫైలుపై రాసి సంతకం చేయరు. ఫలానా వారి ఫోన్లు దొంగచాటుగా వినండి అని మౌఖికంగా మాత్రమే చెబుతారు. ఇప్పుడు సిట్ విచారణలో కూడా కేసీఆర్ దోషి అని తేల్చడం సులువు కాదు. కేసీఆర్‌తో పాటు అప్పుడు చక్రం తిప్పినవారు తాము కోరుకున్న ఫోన్ నంబర్లను ఊరూ పేరూ రాయకుండా నక్సలైట్లతో ముడిపెట్టి సంబంధిత కమిటీల నుంచి ఆమోదం పొందారు. ఈ కారణంగా ఫోన్ ట్యాపింగ్‌తో నాకేమి సంబంధం అని కేసీఆర్ అండ్ కో హూంకరిస్తున్నారు. ఈ కేసులో కేసీఆర్‌ను నేరుగా ఇరికించడం దాదాపు అసాధ్యం. ఈ ధీమాతోనే కేసీఆర్‌నే విచారణకు పిలుస్తారా అని బీఆర్ఎస్ నాయకులు హూంకరిస్తున్నారు. పనిలో పనిగా ఆత్మగౌరవం నినాదం అందుకున్నారు. తెలంగాణ ప్రజలు ఆకలినైనా తట్టుకుంటారు గానీ ఆత్మగౌరవం దెబ్బతింటే తిరగబడతారు. ఈ కారణంగానే నిజాం పాలనలో రజాకార్లను ప్రతిఘటించారు. ఆ తర్వాత దొరల అహంకారాన్ని తట్టుకోలేక తుపాకులు చేతబట్టి నక్సలైట్ ఉద్యమాల్లో పాల్గొన్నారు. నాటి దొరల వారసుడైన కేసీఆర్‌కు ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో మొదటిసారిగా కష్టం వచ్చింది. ఆయన ఆత్మగౌరవం దెబ్బతింటోందని గగ్గోలు పెడుతున్నారు. అయితే ఇప్పుడు యాగీ చేస్తున్నవారంతా కేసీఆర్ పాలనలో ఎంతో మంది ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన విషయాన్ని మరచిపోతున్నారు. ముఖ్యమంత్రిని కలవడానికి నాడు ప్రగతిభవన్‌కు వచ్చిన గద్దర్‌ను లోపలికి అనుమతించకుండా ఎండలో నిలబెట్టడం ఆయన ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం కాదా తెలంగాణ కోసం ఆయన గజ్జెకట్టి గళం విప్పలేదా ఉద్యమ సమయంలో జేఏసీ చైర్మన్‌గా వ్యవహరించిన ప్రొఫెసర్ కోదండరాం వంటి వారికి ఏళ్ల తరబడి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకపోవడం ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం కాదా ఇలా ఎంతో మందికి అవమానాలు ఎదురయ్యాయి. ముఖ్యంగా కేసీఆర్ దొర పోకడల వల్ల తమ ఆత్మగౌరవం దెబ్బతిందని భావించిన తెలంగాణ సమాజం గత ఎన్నికల్లో ఆయనను ఓడించింది. నాటి తమ దొర పోకడలను మరచిపోయి ఇప్పుడు కేసీఆర్ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని నిందిస్తున్నారు. అక్కడితో ఆగకుండా కేసీఆర్ అంటేనే తెలంగాణ అని, తెలంగాణపై ఆయనకు మాత్రమే పేటెంట్ ఉందని,

## వేంకటేశ్వరస్వామితో పెట్టుకుంటే ఈ జన్మలోనే అనుభవిస్తారు: చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి

కుప్పం: తిరుమల వేంకటేశ్వరస్వామితో పెట్టుకుంటే ఈ జన్మలోనే అనుభవిస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. చిత్తూరు జిల్లా కుప్పంలో ఆయన మీడియాతో మాట్లాడారు."తిరుమల పవిత్రమైన ప్రాంతం. మేం వచ్చిన వెంటనే తిరుమల పవిత్రతను కాపాడేందుకు చర్యలు చేపట్టాం. ప్రక్షాళనలో భాగంగానే శ్యామలరావును పంపాం. అప్పుడే శ్యామలరావు ఎన్?డీడీబీ నివేదిక అడిగారు. కల్తీ నెయ్యి ఘటనపై ఎన్?డీడీబీ నివేదిక వచ్చాకే మాట్లాడా. జంతు కొవ్వులు ఉన్నాయని.. కల్తీ చేశారని అప్పుడే చెప్పా. నేను మాట్లాడాక నానా యాగీ చేశారు.. సుప్రీంకోర్టుకు వెళ్లారు. కల్తీ నెయ్యి ఘటనలో దర్యాప్తు కోసం సిట్? వేశాం. నేను క్షమాపణలు చెప్పాలనే పరిస్థితికి వచ్చారు.. వాళ్లనేం అనాలి. వైకాపా నేతల ప్రవర్తన ఎలా ఉంటుందో ఇది ఒక ఉదాహరణ. శ్రీవారు నేను నమ్మే దేవుడు, వేంకటేశ్వరస్వామి దగ్గర నేను సామాన్య భక్తుడినే. వైకుంఠద్వారం గుండా వెళ్లి శ్రీవారిని ఎప్పుడూ దర్శించుకోలేదు. తిరుమల శ్రీవారితో పెట్టుకుంటే ఈ జన్మలోనే అనుభవిస్తారు. తిరుమలలో మహాపాపం చేశారు.. అపచారం చేశారు. అనిల్ కుమార్ సింఘాల్ బదిలీపై ఇప్పుడు మాట్లాడను" అని సీఎం తెలిపారు.

## కేంద్ర బడ్జెట్‌తో ఆంధ్రప్రదేశ్‌కు గణనీయమైన మేలు: మంత్రి లోకేశ్

మొదటిపేజీ తరువాయి

అమరావతి: భారతదేశ వేగవంతమైన అభివృద్ధి లక్ష్యాలకు, దీర్ఘకాలిక ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏపీ మంత్రి నారా లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ బడ్జెట్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు గణనీయమైన మేలు జరగనుందని అభిప్రాయపడ్డారు. క్రిటికల్ మినరల్స్ కారిడార్, హైస్పీడ్ రైలు అనుసంధానం, డేటా సెంటర్లకు పన్ను ప్రోత్సాహకాలు, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగానికి మరింత బలమైన ప్రోత్సాహం ఇస్తుందన్నారు. పర్యాటక రంగంపై నూతన దృష్టి వంటి కీలక అంశాలు ఇందులో ఉన్నాయని సంతోషం వ్యక్తంచేశారు. ఈ బడ్జెట్‌ను సమర్థవంతంగా వినియోగించుకొని పెట్టుబడులను వేగవంతం చేయడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం, ఆంధ్రప్రదేశ్ తదుపరి అభివృద్ధి దశకు శక్తినివ్వడం కోసం కృషి చేస్తామని వెల్లడించారు.

# బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం..

మొదటిపేజీ తరువాయి

దాంట్లో కూడా తెలంగాణను గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసీఐఎల్ లాంటి కంపెనీని హైదరాబాద్‌లో పెట్టింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వమేనన్న భట్టి.. కెమికల్ పార్క్‌లో కూడా హైదరాబాద్‌కు చోటు దక్కలేదని విమర్శించారు.

ఆరెంజ్ ఎకానమీలో హైదరాబాద్ కేంద్రం.. . దానిని కూడా ముంబయికి తరలించారని, తెలంగాణ రాష్ట్రం ఏం తప్పు చేసిందని భట్టి ప్రశ్నించారు. రీజినల్ మెడికల్ హబ్ అని మెన్షన్ చేసినా... అందులో కూడా తెలంగాణ లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళన కోసం ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసినా సాయం అందలేదన్నారు. రామప్ప దేవాలయాన్ని యునెస్కో గుర్తించినా...టూరిజం విషయంలో కూడా రాష్ట్రానికి నిధులు కేటాయింపు జరగలేదన్నారు. సమ్మక్క. సారలమ్మ దర్శనానికి న్యూజిలాండ్ ట్రైబ్స్ కూడా వచ్చారని.. కానీ, కేంద్రం చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. బడ్జెట్‌లో జరిగిన అన్యాయంపై రాజకీయాలకు అతీతంగా.. రాష్ట్రంలోని ఎంపీలు అందరూ కలిసి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని పేర్కొన్నారు.

## చిన్న ఇన్వెస్టర్లకు అండగా.. బైబ్యాక్‌లకు కళ్లెం..!



మార్కెట్‌ను ప్రభావితం చేసే కీలక సంస్కరణలను ఈసారి బడ్జెట్ లో కేంద్రం ప్రవేశపెట్టింది. వీటిల్లో షేర్ల బైబ్యాక్ విధానంలో మార్పులు కూడా ఒకటి. క్యాపిటల్ గెయిన్స్ విధానంలో మాదిరిగానే వీటిపైనా పన్ను విధించాలని నిర్ణయించింది. దీని ప్రభావం కంపెనీలు, ప్రమోటర్లు, పెద్ద ఇన్వెస్టర్లపై వేర్వేరుగా పడనుంది.

వాస్తవానికి మార్కెట్‌లో బైబ్యాక్‌లపై పన్ను ఏ విధంగా వసూలు చేయాలనే అంశంపై దీర్ఘకాలంగా చర్చ జరుగుతోంది. ఎట్టకేలకు ఇప్పుడు దానిపై స్పష్టత వచ్చింది. గతంలో బైబ్యాక్ వేళ వాటాదారులకు వచ్చే సొమ్మును డివిడెండ్ కింద చూసేవారు. కంపెనీలు బైబ్యాక్ డిస్ట్రిబ్యూషన్ పన్నును చెల్లించేవి. ఇక వాటాదారులు మాత్రం తాము అందుకున్న మొత్తంపై పన్ను చెల్లిస్తాడు. అదే సమయంలో నష్టం వచ్చిన షేర్ ధరను విడిగా మూలధన నష్టంగా చూపించేవారు. ఈ విధానాన్ని తాజా బడ్జెట్ తొలగించింది. ఆ స్థానంలో బైబ్యాక్ మూలధన లాభాలుగా పరిగణించి పన్ను విధించనున్నారు. పన్ను ప్రయోజనాల కోసం అనుసరించే ఆర్బిటరేజీ విధానాలను నివారించేందుకు.. మైనార్టీ వాటాదారులను రక్షించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

పన్ను లబ్ధికోసం షేర్ల బైబ్యాక్‌లను వాడుకోవడం నివారించేందుకు ఇప్పుడు దీనిని తెరపైకి తెచ్చారు. ఈ విధానంలో దేశీయ కంపెనీల ప్రమోటర్లు, దేశీయేతర కంపెనీల ప్రమోటర్లకు వేర్వేరు పన్ను స్లాబ్‌లను ప్రకటించారు. డొమెస్టిక్ కంపెనీల ప్రమోటర్లు 22%, దేశీయేతర కంపెనీల ప్రమోటర్లకు 30% పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

పన్నులు తప్పించుకోవడానికి ప్రమోటర్లు వెనకుండి నడిపించే బైబ్యాక్‌లను కట్టడి చేయడానికి ఇది ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. కార్పొరేట్ గవర్నెన్స్‌ను మెరుగు పర్చడంతోపాటు.. నగదును మెరుగైన ఆదాయం సంపాదించేందుకు వినియోగించేలా ప్రోత్సహించనుంది.

ఏమిటీ షేర్ల బైబ్యాక్..

కంపెనీలు తమ వాటాలను మార్కెట్లు లేదా షేర్ హోల్డర్స్ నుంచి నేరుగా కొనుగోలు చేస్తాయి. మార్కెట్లో అందుబాటులో ఉండేవాటి సంఖ్య తగ్గిన ఫలితంగా మిగిలిన వాటాల విలువ పెరుగుతుంది.

కంపెనీలు తమ వద్ద నగదు నిల్వలు సరిపడా ఉన్నప్పుడే బైబ్యాక్‌లు చేపడతాయి. సాధారణంగా వాటాదారులకు డివిడెండ్లు చెల్లించకుండా షేర్ విలువను చెల్లిస్తాయి.

సాధారణంగా బైబ్యాక్‌లు కంపెనీ ఆత్మవిశ్వాసాన్ని తెలియజేయడంతోపాటు.. షేర్ ధరకు మద్దతుగా ఉంటాయి. దీంతోపాటు ఎర్నింగ్ పర్ షేర్ విలువను కూడా పెంచుతాయి.

ఈ నిర్ణయంతో ఎవరికి లాభం.. ఎవరికి నష్టం..

కొత్త విధానంతో రెగ్యూలర్ ఇన్వెస్టర్లకు లాభం. వీరికి సంబంధించి పాత విధానంలో బైబ్యాక్‌తో వచ్చిన సొమ్మును డివిడెండ్ కింద భావించేవారు. దీంతో 35% పన్ను చెల్లించాల్సి వచ్చేది. కానీ, కొత్త విధానంలో 20% షార్ట్ టర్మ్ గెయిన్స్ కింద.. 12.5% లాంగ్‌టర్మ్ గెయిన్స్ కింద చెల్లించాల్సి వస్తుంది. దీంతో నాన్ ప్రమోటర్ వాటాదారులపై పెద్దమొత్తంలో భారం తగ్గిపోతుంది. దీంతో మరింత మంది ఇన్వెస్టర్లు బైబ్యాక్‌లో పాల్గొనడానికి ఆసక్తి చూపుతారు. కంపెనీలు కూడా బైబ్యాక్‌పై పంపిణీ పన్ను చెల్లించాల్సిన అవసరంలేదు.

ప్రమోటర్లు మాత్రం భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. అసలు బైబ్యాక్ ప్రక్రియ నిర్ణయాల్లో ప్రమోటర్ల జోక్యం పెరిగిందనే విమర్శలు వెల్లువెత్తున్న వేళ కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. దీనిద్వారా సాధారణ వాటాదారుల కంటే ప్రమోటర్లకు ఉండే అదనపు అధికారాలు దుర్వినియోగం కావు.

## బడ్జెట్ తర్వాత 30 మంది విద్యార్థులను కలవనున్న నిర్మలమ్మ..

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం ఎంపిక చేసిన విద్యార్థులు (ఏశీశ్రీశ్రీవస్త్రవ ర్‌బంవత్‌ం) లోక్‌సభ గ్యాలరీ నుంచి ప్రత్యక్షంగా బడ్జెట్ ప్రసంగాన్ని వినే అవకాశం కల్పించారు. వీరు కర్తవ్య భవన్‌లోని ఆర్థిక మంత్రిత్వ శాఖను కూడా సందర్శించనున్నారు. ఆర్థిక శాఖ పనితీరు, విధాన రూపకల్పన ప్రక్రియలు, అత్యున్నత స్థాయిల్లో ఆర్థిక నిర్ణయాలు ఎలా రూపొందిస్తారు, అమలు చేస్తారు అనే విషయాలను ఆ విద్యార్థులు తెలుసుకోనున్నారు. పరిపాలనకు సంబంధమైన విషయాలపై విద్యార్థుల్లో అవగాహన తీసుకురావడానికి కేంద్రం ఈ వినూత్న నిర్ణయం తీసుకుంటున్నట్లు సమాచారం. బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విద్యార్థులతో సమావేశమై.. బడ్జెట్‌పై వారి అభిప్రాయాలను, సూచనలను తెలుసుకోనున్నారు.

## టెక్ కంపెనీలకు గుడ్‌న్యూస్.. 2047 వరకు 'ట్యాక్స్ హాలిడే'

మొదటిపేజీ తరువాయి

"భారత్‌లోని డేటా సెంటర్లను ఉపయోగించి ప్రపంచవ్యాప్త కస్టమర్లకు క్లౌడ్ సేవలను అందించే విదేశీ కంపెనీలకు 2047 వరకు ట్యాక్స్ హాలిడే కల్పిస్తాం. అయితే, ఈ ట్యాక్స్ హాలిడేను పొందేందుకు కంపెనీలు భారతీయ రీసెల్లర్ల ద్వారానే భారత కస్టమర్లకు సేవలను అందించాల్సి ఉంటుంది" అని నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. ఈ విదేశీ సంస్థలకు డేటా సెంటర్ సేవలందించే భారతీయ కంపెనీలు 15 శాతం సేఫ్ హార్బర్ మార్జిన్ (విదేశీ కంపెనీలకు సేవలందించే దేశీయ ఐటీ సంస్థలకు వర్తించే నిర్దిష్ట లాభ మార్జిన్) పొందొచ్చు. ఈ సేఫ్ హార్బర్ నిబంధనలను పొందేందుకు అవసరమైన టర్నోవర్ పరిమితిని రూ.300 కోట్ల నుంచి రూ.2 వేల కోట్లకు పెంచారు.

బడ్జెట్‌పై ఆపరేషన్ సిందూర్ ఎఫెక్ట్: భారీగా పెరిగిన రక్షణ బడ్జెట్

ఏంటీ ట్యాక్స్ హాలిడే..

ట్యాక్స్ హాలిడే అంటే నిర్దిష్ట కాలం పాటు కంపెనీలు ఆదాయ, కార్పొరేట్ వంటి పన్నులు చెల్లించాల్సిన అవసరం లేకుండా మినహాయింపులు పొందొచ్చు. ఫలితంగా కంపెనీలపై ప్రాజెక్ట్ ఖర్చుల భారం తగ్గుతుంది. దీని వల్ల ఆయా రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు వీలు లభిస్తుంది. ప్రపంచస్థాయి కంపెనీల దృష్టిని ఆకర్షించేందుకు వీలవుతుంది. అంతేగాక, ఉద్యోగాల సృష్టి జరగడంతో పాటు ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుంది.

ఐటీ కంపెనీలకు రెడ్ కార్పెట్

ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో గూగుల్ భారీ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. దీంతో పాటు రైడెన్ ఇన్ఫో, ఇతర కంపెనీలు కూడా భారత్‌లో డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నాయి. తాజా 'ట్యాక్స్ హాలిడే'తో ఈ కంపెనీలకు రెడ్‌కార్పెట్ పరిచినట్లయ్యింది. ఈ నిర్ణయంతో ఐటీ, ఇంజినీరింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో వేలాది ఉద్యోగాలు ఏర్పడే అవకాశం ఉంది. అంతేగాక విద్యుత్, మౌలిక సదుపాయాల కల్పన వంటి రంగాల్లోనూ అభివృద్ధి జరగనుంది. దేశ భద్రత పరంగానూ ఇది కీలకంగా మారనుంది.

ఏంటీ డేటా సెంటర్లు..

డేటా సెంటర్ అంటే డేటా నిల్వ చేసి, ప్రాసెస్ చేసి, నిర్వహించే కేంద్రం. వివిధ సంస్థలు తమ కీలక అప్లికేషన్లు, డేటా నిల్వ చేయడానికి, డెలివరీ చేయడానికి వీలుగా కంప్యూటింగ్, నిల్వ వనరుల నెట్‌వర్క్‌పై డేటా సెంటర్ రూపకల్పన ఆధారపడి ఉంటుంది. స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్, క్లౌడ్ సర్వీస్, ఏఐ, బిగ్‌డేటా వంటి సేవలు అన్నీ డేటా సెంటర్‌పైనే ఆధారపడి ఉంటాయి. కంపెనీల వాణిజ్య కార్యకలాపాలకు డేటా సెంటర్లు ఎంతో కీలకం.

# ఏపీకి కేటాయింపులు..

## నిర్మలమ్మ బడ్జెట్ భేష్: రామ్మోహన్ నాయుడు

మొదటిపేజీ తరువాయి

సుస్థిర అభివృద్ధిని తీసుకురాగలిగిందని రామ్మోహన్ నాయుడు అన్నారు. కొత్త ఆదాయపు పన్ను చట్టం సామాన్యులను మరింత ఆకట్టుకుందని తెలిపారు. ఏడు నగరాల మధ్య హై స్పీడ్ కారిడార్లు, టూరిజం అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ, డేటా సెంటర్ల ఏర్పాటుకు తోడ్పాటు అందివ్వడం.. ఇలా ప్రతీ అంశం ప్రగతిని సూచిస్తోందని అన్నారు.ప్రస్తుత ప్రపంచ అస్థిరతల నడుమ కూడా ప్రభుత్వం బలమైన, స్థిరమైన ఆర్థిక విధానాన్ని పాటిస్తోందని.. 2026-27కి కేంద్ర పెట్టుబడులను గతంలో కంటే అధికంగా రూ.12.2 లక్షల కోట్లకు పెంచడం ద్వారా ప్రభుత్వం తన విజన్‌ను స్పష్టం చేసిందని పేర్కొన్నారు. ఈ పెట్టుబడులు తన శాఖ పరిధిలోని పౌర విమానయానం, విమానాశ్రయాలతో పాటు రైల్వేలు, రహదారులు, పోర్టులు, లాజిస్టిక్స్, పట్టణ మౌలిక సదుపాయాలు, డిజిటల్ ఇన్‌ఫ్రాస్టక్చర్‌లపై ఉన్నాయని అన్నారు. ఇది ఉపాధి, పెట్టుబడులు, పెట్టుబడిదారుల విశ్వాసానికి దోహదపడుతుందని స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో బాలికల వసతి గృహం గొప్ప ఆలోచన అని అన్న రామ్మోహన్ నాయుడు.. బాలికా విద్య మరింత ఉన్నతంగా ప్రకాశిస్తుందని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్థిక తోడ్పాటు అందిస్తూ నిర్మలమ్మ పద్దులు ఉండటం, అందులో ఆంధ్రప్రదేశ్‌కు సైతం సింహభాగం కేటాయింపులు జరగడం ఆనందంగా ఉందన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని ప్రధాన పంటగా ఉన్న కొబ్బరికి తోడ్పాటు అందించే విధంగా కొబ్బరి ప్రోత్సాహక పథకం.. ఉద్దాన ప్రాంతానికి మళ్లీ పూర్వ వైభవాన్ని తెస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జీడి పంటకు సైతం తోడ్పాటు అందించే విధంగా కేటాయింపులు ఉండటం శుభపరిణామం అన్నారు.

## తెలంగాణకు 3 హైస్పీడ్ రైళ్లు..

మొదటిపేజీ తరువాయి




కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌కు లబ్ధి కలిగే పథకాన్ని కేంద్రం తీసుకొచ్చిందని తెలిపారు."ప్రతి జిల్లాలో ఒక్కో బాలికల హాస్టల్‌ను కేంద్రం ఏర్పాటు చేయనుంది. తెలంగాణలోని 33 జిల్లాలకు బాలికల హాస్టళ్లు మంజూరు అవుతాయి. డేటా సెంటర్లకు ఉపయోగపడే నిర్ణయాన్ని మోదీ సర్కారు తీసుకుంది. డేటా సెంటర్లకు ఇచ్చే ప్రోత్సాహం వల్ల తెలంగాణకూ లాభం. విదేశీ విద్య కోసం వెళ్లే విద్యార్థులపై ఉండే పన్నును 5 శాతం నుంచి 2 శాతానికి తగ్గించారు. విదేశీ విద్యపై పన్ను తగ్గించటం వల్ల తెలుగు విద్యార్థులకు ఎంతో మేలు. రైల్వే బడ్జెట్‌ను రూ. 2.77 లక్షల కోట్లకు పెంచింది. రాష్ట్రానికి మూడు హైస్పీడ్ రైళ్లు రానున్నాయి. మెట్రో రైలు గురించి ప్రత్యేకంగా బడ్జెట్‌లో ఉండదు. మెట్రోపై డీపీఆర్ ఇస్తే.. పట్టణాభివృద్ధి శాఖ నిధులు ఇస్తుంది. మెట్రో రైలు ప్రాజెక్టుకు మంత్రివర్గ ఆమోదంతో నిధులు వస్తాయి. ప్రస్తుత మెట్రో ప్రాజెక్టు టేకోవర్ ప్రక్రియ పూర్తి చేసి డీపీఆర్ ఇస్తే కేంద్రం ఆమోదిస్తుంది. దేశంలో ఉపాధి అవకాశాలు పెంచేలా మోదీ సర్కారు చర్యలు చేపట్టింది" అని కిషన్ రెడ్డి వెల్లడించారు.

అదో టీవీ సీరియల్‌గా..

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్‌ను సిట్ అధికారులు విచారిస్తోన్న సంగతి తెలిసిందే. దానిపై మీడియా అడిగిన ప్రశ్నకు కిషన్ రెడ్డి స్పందించారు. "ఫోన్ ట్యాపింగ్ కేసు టీవీ సీరియల్ మాదిరిగా కొనసాగుతోంది. ఇప్పటికే రెండేళ్లయ్యింది. ఇంకా ఎన్నాళ్లు సాగుతుందో తెలియదు. ఫోన్ ట్యాపింగ్ నిజమని స్వయంగా కేసీఆర్ కుమార్తె చెప్పారు. ఇంటి అల్లుడి ఫోన్ ట్యాప్ చేశారని స్వయంగా కవిత చెప్పారు. సాక్షాత్తు హైకోర్టు జడ్జిల ఫోన్లు ట్యాపింగ్ జరిగిందని అఫిడవిట్ వేశారు. నేతలు, వ్యాపారులు, సినీ నటుల ఫోన్లు ట్యాపింగ్ జరిగిందని అందులో పేర్కొన్నారు" అని కిషన్ రెడ్డి తెలిపారు.

# ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ ని కలిసిన మన్ననూరు ఆర్యవైశ్యులు

- నిరుపేద కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి



తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత గారికి మన్ననూర్ గ్రామానికి చెందిన తెలంగాణ స్టేట్ మహాసభ నాయకులు సంబు వెంకటరమణ, సత్యనారాయణ, పూరి సాయిబాబా అరణ్య భవన్ లో ఉన్న వారి కార్యాలయానికి వెళ్లి వైశ్య కార్పొరేషన్ కు ప్రభుత్వం 25 కోట్ల రూపాయలను మంజూరు చేసింది. ఆ నిధులు గ్రామీణ ప్రాంతాలలో ఉన్న నిరుపేద కుటుంబాలకు సహాయం అందించాలని శ్రీమతి కల్వ సుజాత వైశ్య కార్పొరేషన్ చైర్మన్ గారిని కోరారు అలాగే వినతిపత్రం కూడా సమర్పించారు. గత మూడు నెలల కింద సిటీ బస్సులో పది తులాల బంగారము 60 వేల రూపాయలు అఫ్జల్ గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోయిన విషయము అలాగే రికవరీ అయి ఇంకా ఇవ్వని విషయం వెంకటరమణ గారు కల్వ సుజాత చైర్మన్ గారికి వినతిపత్రం ఇవ్వగానే వెంటనే స్పందించిన కార్పొరేషన్ చైర్మన్ పోలీస్ డిపార్ట్మెంట్ కు ఫోన్ చేసి విషయం కనుక్కున్నారు. తొందరలోనే వస్తువులు పోగొట్టుకున్న వారికి కోర్టు ద్వారా ఇస్తామని పోలీస్ శాఖ వారు తెలిపారు. ఎవరికీ రాష్ట్రంలో ఏ మూల ఆర్యవైశ్యులకు ఇబ్బంది అయినా ఒక ఫోన్ కాల్ తో స్పందిస్తానని వైశ్య కార్పొరేషన్ చైర్మన్ సుజాత తెలిపారు.

# రేపు అచ్చంపేటలో పర్యటించనున్న మీనాక్షి నటరాజన్

- ఉపాధి హామీ బచావో వీబీ- జీఆర్ ఏఎంజీ హటావో నినాదంతో కార్యక్రమం



నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలో సోమవారం ఉపాధి హామీ బచావో వీబీ- జీఆర్ ఏఎంజీ హటావో అనే నినాదంతో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనడానికి ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ అచ్చంపేటకు రానున్నారు ఈ కార్యక్రమానికి సంబంధించిన పర్యటన షెడ్యూల్ లో డిసిసి అధ్యక్షులు ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ తో కలిసి ఆమె పాల్గొంటారని ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి 11:30 గంటల వరకు అచ్చంపేట మండలం బుడ్డ తాండ గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో నేరుగా ముఖాముఖి సమావేశం నిర్వహించిన తర్వాత 12 గంటల నుంచి 1:30 గంటల వరకు బల్మూరు మండలం చెంచుగూడెం గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో ముఖాముఖి కార్యక్రమం తర్వాత భోజన విరామం అనంతరం 3 గంటల నుండి 3:30 వరకు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నారు. కావున ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్, మహిళలు, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# ఎలుకుర్తి హవేలీలో మడేలేశ్వర స్వామి జయంతి ఘనంగా



ఎలుకుర్తి హవేలీ గ్రామంలోని దత్తాత్రేయ రజక సంఘం ఆలయ ప్రాంగణంలో రజకుల కులదైవం శ్రీ మడేలేశ్వర స్వామి జయంతి వేడుకలను ఆదివారం కుల సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి చిత్రపటానికి పూలమాలలు అర్పించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు నివాళులర్పిస్తూ ప్రార్థనలు చేశారు. కుల పెద్దలు మాట్లాడుతూ స్వామి ఆశీస్సులతో సమాజం అభివృద్ధి చెందాలని, కుల బాంధవులందరూ ఐకమత్యంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. వేడుకల్లో కుల పెద్దమనుషులు, గుడి పెద్దలు, చిట్టి కుల ప్రతినిధులు, రజక సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం భక్తి వాతావరణంలో ముగిసింది.

# అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందచేసిన చల్లా ధర్మారెడ్డి



తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కి అక్రమ సిట్ నోటీసులు అందివ్వడాన్ని ఖండిస్తూ రేవంత్ రెడ్డి సర్కారుకి భారత రాజ్యాంగం,చట్టాలపై అవగాహన కల్పించాలని కోరుతూ పరకాల పట్టణంలోని డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందచేసిన పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి,ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమోద్ ఖత్రిని సన్మానించిన బాల్య మిత్రులు

ఈకాలం, ఆదిలాబాద్

జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఇటీవల అవార్డు అందుకున్న సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రిని బాల్య మిత్రులు సన్మానించారు. ఆదివారం కోలిపురకు చెందిన ఆయన స్నేహితులు శాలువాతో సత్కరించారు. బాల్య మిత్రుడు ఎంఈఓ సోమయ్య మాట్లాడుతూ సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి చేసిన సేవలను గుర్తించి ప్రశంస పత్రం అందుకోవడం గర్వ కారణమని తెలిపారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతారని ఆశిస్తున్నామని అన్నారు. అనంతరం ప్రగతి విద్యాసంస్థల అధిపతి అధినాథ్ దంపతులు సైతం ప్రమోద్ కుమార్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొలిపురా మిత్ర మండలి నరేష్ రెడ్డి, నగేష్, ఆశిష్, దిలీప్, వెంకటి, అశోక్ తదితరులు పాల్గొన్నారు





# వెల్గటూర్ మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై ఫోన్ ట్యాపింగ్ నెపంతో కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ, ఆదివారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు చల్లూరి రామచంద్ర గౌడ్ మాజీ ఏఎంసి చైర్మన్ పత్తిపాక వెంకటేష్ వర్మ జూపాక కుమార్ లా ఆధ్వర్యంలోని బి ఆర్ఎస్ పార్టీ శ్రేణులు భారీ నిరసన చేపట్టారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.?ఈ సందర్భంగా నాయకులు పత్తిపాక వెంకటేష్ వర్మ చల్లూరి రామచంద్ర గౌడ్ మాట్లాడుతూ. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే కేసీఆర్ ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇలాంటి చర్యలను బిఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా ఖండిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న ఈ నిరసనల పర్వంలో భాగంగా వెల్గటూర్లో కూడా కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ పతిపాక వెంకటేష్ వర్మ , టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చల్లూ రామ్ చంద్రం, రంగూ తిరుపతి, మూగల సత్యం, కోటిలింగాల సర్పంచ్ పరుష్ కోటయ్య, తాళ్ల కొత్తపేట సర్పంచ్ ద్యావన పెల్లి సుధాకర్, కొప్పుల విద్యా సాగర్, కిషన్రావుపేట సర్పంచ్ కుమ్మరి వెంకటేష్, బిడారి తిరుపతి, కారుకూరి సత్తయ్య, అనుమాల తిరుపతి, కుంటల



రాజు, మేరుగు కొమురయ్య, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పోడేటి రవి గౌడ్ , కొప్పుల సురేష్, సంకోజు తిరుమల చారి , మొకెన పెల్లి రాజమ్మ, రామిల్లా సనిల్, ఎండీ దస్తగిరి, కొదురుపాక అనిల్, బోగే రాజయ్య, పాలితం శ్రీదర్, శివరాజం, కనపర్తి సుధాకరరావు, మెరుగు అశోక్, ఎర్రోళ్ల మహేష్, మోత్కూరి శేఖర్, యాగండ్ల మల్లేష్, చిలువేరి తిరుపతి, అల్గునూరి సతీష్, పుధారి రాజేందర్, పంబల తిరుపతి, ఎత్తెం తిరుపతి, నవీన్, వంశీ, రాకేష్, దిలీప్, రాజేష్, అంజి, జనార్ధన్, గుమ్మల అజిత్, బందెల నర్సయ్య, రాయపట్నం మాజీ సర్పంచ్ ఈర్ల మొండయ్య, అడ్డగట్ల తిరుపతి, గాలిపెల్లి మహేష్ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఓటుకు నోటు మద్యానికి బానిసచేస్తున్న నాయకులు

- రాజకీయాన్ని రౌడీయిజంగా మారుస్తున్న నాయకులు పోటీకి ముందు ఒక మాట పోటి తర్వాత ఒక మాట ఎక్కడి న్యాయం. ?






ఎన్నికలు రాగానే ప్రజలకు ప్రేమతో నేను పోటీ చేస్తున్నాను మీ ఓటు నాకు వేయండి అని ప్రజలకు మందు కు డబ్బులకు బానిసలుగా మార్చి డబ్బుకు ఆశపెట్టి ప్రచారంలో పాల్గొంటున్నారు. ఎన్నిసార్లు ఓడిపోయిన గెలిచిన అదే సంగతి కొత్తవారు పోటీ చేస్తే దీవించడం చులకనగా చూడడం జరుగుతుంది ప్రజలు చెబుతున్నారు. గెలిచి ఏం చేయాలేక పోయావు ఇప్పుడు మళ్లీ కౌన్సిలర్ గా పోటీ చేసి నన్ను గెలిపించండి అని ప్రజలకు అంటున్నావు ఒకే వార్డ్ కి అంకితమైన కౌన్సిలర్లు వాళ్లకు వేరే వార్డ్ కి కౌన్సిలర్ గా పోటీ చేసే గుర్తింపు లేదు అందుకని ఉన్నవాళ్లు పోటీపడి ప్రజలకు బానిసలుగా మార్చి సీటు కోసం ప్రజలకు మోసం చేస్తున్నారు తన ఇల్లే సరిగా లేనప్పుడు కౌన్సిలర్ గా పోటీ చేసి ప్రజలకు ఎలా కాపాడుతాడు. అని ప్రజలు ఆలోచిస్తున్నారు. రాజకీయాన్ని రౌడీయిజంగా మార్చేస్తున్నారు ఇది ఎక్కడ న్యాయం ఒక్కసారి కాదు ఎన్నిసార్లు ఓడిన నేనే పోటీ చేస్తాను అని ప్రజలకు కాలుని వాసులకు మోసం చేస్తున్నారు ప్రజలు కొత్తవారు కావాలంటే భయభ్రాంతులకు గురిచేస్తున్నారు ఎన్నికల ముందు నేను ఉన్నాను అంటున్నారు తర్వాత ప్రజలకు పట్టించుకోవడం లేదు. ఓటుకు నోటు మద్యానికి బానిస చేసి ప్రజలకు ఇబ్బంది పెడుతున్నారు ఇలాంటి నాయకులు అవసరమా అని ప్రజలు నిలదీస్తున్నారు.

# కేసీఆర్‌పై కక్షసాధింపు ఆపాలి:

హనుమకొండలో బీఆర్ఎస్ ర్యాలీ

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతోందని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ తీవ్రంగా విమర్శించారు. కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతో సిట్ నోటీసులు జారీ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సిట్ నోటీసులను నిరసిస్తూ ఆదివారం హనుమకొండలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించాయి. బాలసముద్రంలోని పార్టీ కార్యాలయం నుంచి అదాలత్, అంబేద్కర్ సర్కిల్ మీదుగా ఎంజీఎం వరకు ర్యాలీ సాగింది. ఎంజీఎం సర్కిల్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకోగా వినయ్ భాస్కర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం ఆయనతో పాటు పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేసి మట్టెవాడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అనంతరం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, "14 ఏళ్ల పోరాటంతో తెలంగాణ సాధించిన కేసీఆర్‌ను పలచన చేయాలని ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది. సిట్ అధికారులు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉల్లంఘిస్తూ చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. వ్యక్తిగత హక్కులను కాలరాస్తున్నారు," అని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు, 6 గ్యారంటీలు అమలు చేయడంలో విఫలమైందని, ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి నుంచి దృష్టి మళ్లించేందుకే 'డైవర్షన్ పాలిటిక్స్' చేస్తోందని విమర్శించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుతుందని, ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. "కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే మా లక్ష్యం," అని వినయ్ భాస్కర్ ప్రకటించారు.



# సిట్ నోటీసులపై బీఆర్ఎస్ ఆగ్రహ జ్వాల

- కేసీఆర్‌కు మద్దతుగా గీసుగొండలో ధర్నా - పోలీసుల జోక్యంతో భగ్నం



తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, తెలంగాణ ఉద్యమ సాధకుడు కేసీఆర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపుతో సిట్ నోటీసులు జారీ చేసిందని నిరసిస్తూ గీసుగొండ మండలంలోని కొనయమకుల గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. వరంగల్--నర్సంపేట ప్రధాన రహదారిపై నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. మండల పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో నాయకులు, యువజన కార్యకర్తలు హాజరయ్యారు. కేసీఆర్‌పై అక్రమ కేసులు పెట్టడం, సిట్ నోటీసులు ఇవ్వడం పూర్తిగా రాజకీయ కక్షసాధింపేనని నాయకులు మండిపడ్డారు. ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యకర్తలను భయపెట్టేందుకు తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో ఆందోళన కొనసాగించారు. అయితే ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందనే కారణంతో గీసుగొండ సీఐ డి. విశ్వేశ్వర్ సిబ్బందితో చేరుకుని ధర్నాను భగ్నం చేసి కార్యకర్తలను చెదరగొట్టారు. పోలీసుల జోక్యంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు పాల్గొన్నారు.



# మరోమారు జంటగా శివాజీ, లయ

నేరుగా ఓటిటిలోకి సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'.



టాలీవుడ్ సీనియర్ నటీనటులు శివాజీ, లయ చాలా కాలం తర్వాత జంటగా నటించిన క్రైమ్ కామెడీ చిత్రం 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'. సుధీర్ శ్రీరామ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం థియేటర్లకు రాకుండా నేరుగా డిజిటల్ వేదికగా విడుదలవుతోంది. అయితే ఈ సినిమా హక్కులను ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఈటీవీ విన్ దక్కించుకోగా.. తాజాగా స్ట్రీమింగ్ వివరాలను వెల్లడించింది. ఈ సినిమాను ఫిబ్రవరి 12 నుంచి స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు ప్రకటించింది.ఒకప్పుడు వెండితెరపై సూపర్ హిట్ జోడీగా పేరు తెచ్చుకున్న శివాజీ, లయ కాంబినేషన్ అనగానే ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. 'స్వయంవరం', 'టాటా బిర్లా మధ్యలో లైలా' వంటి చిత్రాల్లో వీరి కెమిస్ట్రీకి మంచి గుర్తింపు దక్కింది. ఇప్పుడు మళ్ళీ ఒక వెరైటీ టైటిల్‌తో, క్రైమ్ ఎలిమెంట్స్ కలిసిన కామెడీ ఎంటర్‌టైనర్‌తో వీరు రాబోతుండటం విశేషం. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై ఆసక్తిని పెంచాయి.

# నా రాజకీయ ప్రవేశం ప్రభావం పడుతుందనుకున్నా

విజయ్ హీరోగా నటించిన 'జన నాయగన్' చిత్రం వివాదాల్లో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికే దర్శక నిర్మాతలు దీనిపై స్పందించగా.. తాజాగా విజయ్ ఈ విషయంపై మాట్లాడారు. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'జన నాయగన్'కు ఇలా జరగడం చాలా బాధగా ఉందన్నారు. నా నిర్మాతల గురించి నాకు బాధగా ఉంది. నేను రాజకీయాల్లోకి రావడం వల్లే నా సినిమాకు ఇలా చేస్తున్నారు. నా కారణంగా నిర్మాతలు ఇబ్బంది పడుతున్నారు. రాజకీయరంగంలోకి రాకముందే వీటన్నిటికీ సిద్ధమయ్యాను. నా సినిమాపై ఈ ప్రభావం పడుతుందని ముందే ఊహించాను' అని తెలిపారు. ఈ సినిమా నిర్మాత వెంకట్ కె.నారాయణ కూడా దీని విడుదల ఆలస్యం కావడంపై ఇటీవల బాధపడ్డారు. దశాబ్దాల పాటు అభిమానులను అలరించిన విజయ్‌కు సినిమాల నుంచి మంచి వీడ్కోలు దక్కాలని ఆయన ఆకాంక్షించినట్లు చెప్పారు. కానీ, పరిస్థితి తమ చేయి దాటిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. సెన్సార్ సమస్య వల్ల ఈనెల 9న విడుదల కావాల్సిన 'జన నాయగన్' వాయిదా పడింది. ఈ చిత్రానికి యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డుకు అదే తేదీన మద్రాస్ హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాలు చేస్తూ సీబీఎఫ్‌సీ మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. సెన్సార్ సర్టిఫికెట్ జారీపై న్యాయస్థానం తాత్కాలిక స్టే విధించగా.. నిర్మాణసంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సినిమా విడుదల విషయంలో జోక్యానికి నిరాకరించిన అత్యున్నత న్యాయస్థానం మద్రాసు డివిజన్



బెంచ్‌నే ఆశ్రయించాలని నిర్మాతలకు సూచించింది. ఈనెల 21న సుదీర్ఘ వాదనల అనంతరం డివిజన్ బెంచ్ తీర్పును రిజర్వ్ చేసింది. సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. మరోసారి దీనిపై విచారణ జరపాలని ఆదేశించింది.

# క్లాసూ... మాసూ

ఒకవైపు 'పెద్ది' సినిమా చిత్రీకరణలో పాల్గొంటూనే...



మరోవైపు కొత్త సినిమా కథకు సంబంధించిన పనులపై దృష్టి పెడుతున్నారు రామ్‌చరణ్. 'పెద్ది' తర్వాత ఆయన సుకుమార్ దర్శకత్వంలో సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. ఆ సినిమా కోసం సుకుమార్ ఎప్పట్నుంచో కథని సిద్ధం చేస్తున్నారు. ఆయన తరహా ఓ క్లాస్ కథతోపాటు... అందుకు పూర్తి భిన్నంగా ఒక మాస్ కథనీ సిద్ధం చేసినట్టు సమాచారం. 'రంగస్థలం'లో రామ్‌చరణ్‌ని మాస్ పాత్రలోనే చూపించారు సుకుమార్. మరోసారి అలాంటి విభిన్నమైన పాత్రలోనే రామ్‌చరణ్‌ని చూపించాలని సుకుమార్ భావిస్తున్నట్టు సమాచారం. రామ్‌చరణ్ కూడా మాస్ కథకే పచ్చజెండా ఊపారని సమాచారం. అందులో లుక్ కూడా గత సినిమాలకు భిన్నంగా ఉంటుందని తెలుస్తోంది. ఈ ఏడాది వేసవిలోనే ఈ సినిమా చిత్రీకరణని ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. 'పుష్ప' చిత్రాల తర్వాత సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో 'పెద్ది' చిత్రీకరణ సాగుతోంది. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ఓ సెట్‌లో పాటని చిత్రీకరిస్తున్నారు.



# శ్రీవారిని దర్శించుకున్న అనిల్ రావిపూడి

## తదుపరి చిత్రం వివరాలు త్వరలోనే వెల్లడిస్తా

టాలీవుడ్ సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయన దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా వచ్చిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం భారీ విజయం పట్ల కృతజ్ఞతగా స్వామివారికి మొక్కులు చెల్లించుకోవడానికి ఆయన తిరుమల వచ్చారు.శ్రీవారి దర్శనం అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడిన అనిల్ రావిపూడి తన తదుపరి ప్రాజెక్ట్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తన నెక్స్ట్ మూవీపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని, మరో 10 నుంచి 15 రోజుల్లో అధికారికంగా అప్‌డేట్ ఇస్తానని ఆయన స్పష్టం చేశారు. ఫిల్మ్ నగర్ సమాచారం ప్రకారం, అనిల్ తన తదుపరి చిత్రాన్ని విక్టరీ వెంకటేష్‌తో చేసే అవకాశం ఉంది. ఇది ఒక భారీ మల్టీస్టారర్ అని, ఇందులో తమిళ స్టార్ కార్తీ లేదా మలయాళ నటుడు ఫహద్ ఫాజిల్ నటించే ఛాన్స్ ఉందనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటివరకు ఎక్కువగా ఎంటర్‌టైన్మెంట్ చిత్రాలే అందించిన అనిల్, ఈసారి పూర్తిగా కొత్త జానర్‌లో ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ వేగంగా జరుగుతోంది.



# అమ్మానాన్నల విడాకులు పాఠం నేర్పాయి

## నటి శృతిహాసన్ భావోద్వేగం

కమల్ హాసన్ వారసురాలిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన శృతి హాసన్, ప్రస్తుతం స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. అయితే, వెండితెరపై ఆమె గ్లామర్ వెనుక ఎంతో కష్టం.. భావోద్వేగమైన గతం ఉందని ఆమె తాజాగా ఒక ఇంటర్వ్యూలో బయటపెట్టారు. తన తల్లిదండ్రులు కమల్ హాసన్, సారిక విడిపోవడం తన జీవితాన్ని ఎలా మార్చేసిందో శృతి వివరించారు. తల్లిదండ్రుల విడాకుల తర్వాత తన జీవితం ఒక్కసారిగా తలకిందులైందని శృతి చెప్పారు. 'చెన్నైలో మెర్సిడెస్ బెంజ్ కార్లలో తిరిగిన నేను, అమ్మతో కలిసి ముంబై వచ్చాక లోకల్ ట్రైన్లలో ప్రయాణించాల్సి వచ్చింది. లగ్జరీ జీవితాన్ని, అలాగే కష్టాలను కూడా చూశాను' అని ఆమె తెలిపారు. అయితే, ఈ విడాకులు తనకు ఒక గొప్ప జీవిత పాఠాన్ని నేర్పాయని ఆమె అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఒక స్త్రీ ఆర్థికంగా, మానసికంగా స్వతంత్రంగా ఉండటం ఎంత ముఖ్యమో తనకు అప్పుడే అర్థమైందని చెప్పుకొచ్చింది.. 'ఇద్దరు వ్యక్తులు కలిసి సంతోషంగా ఉండలేనప్పుడు, బలవంతంగా ఒకే ఇంట్లో ఉండి నరకం అనుభవించడం కంటే.. విడిపోయి విడిగా సంతోషంగా ఉండటమే మంచిది. అందుకే వారు విడిపోయినందుకు నేను ఒక రకంగా సంతోషించాను' అని శృతి హాసన్ కుండబద్దలు కొట్టారు. మొదట్లో 'ఐరన్ లెగ్' అని విమర్శలు ఎదుర్కొన్నా, తన కష్టంతో నేడు దేశంలోనే అత్యధిక పారితోషికం తీసుకునే నటీమణుల్లో ఒకరిగా నిలవడం విశేషం. ప్రజెంట్ ఈ మాటలు వైరల్ అవుతున్నాయి.

# పల్లెటూరి అమ్మాయిగా ఫిరయా అబ్దుల్లా

## భగవంతుడి మూవీలో డిఫరెంట్ రోల్




'జాతిరత్నాలు'తో ఒక్కసారిగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఫరియా అబ్దుల్లా పేరు చెబితే ఇప్పటికీ చాలామందికి చిట్టి పాత్రే గుర్తొస్తుంది. ఆ సినిమాతో వచ్చిన క్రేజ్ తర్వాత ఆమె కెరీర్ గ్రాఫ్ ఊహించినంత వేగంగా ముందుకెళ్లకపోయినా, ఫరియా మాత్రం తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్‌ను నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తూనే ఉంది. మధ్యలో కొన్ని సినిమాలు చేసినా అవి పెద్దగా వర్కౌట్ కాలేదు. అయితే వెండితెరపై బ్రేక్ లేకపోయినా, సోషల్ మీడియాలో మాత్రం ఆమె యాక్టివిటీ ఎప్పుడూ తగ్గలేదు. గ్లామరస్ ఫోటోలు, వీడియోలతో ఫ్యాన్స్‌కు దగ్గరగానే ఉంటూ తన పాపులారిటీని కంటిన్యూ చేస్తోంది.

ఇప్పటికే తిరువీర్ హీరోగా నటిస్తున్న 'భగవంతుడు' సినిమా టీజర్ విడుదల కావడంతో ఫరియా మళ్లీ చర్చల్లోకి వచ్చింది. ఈ టీజర్‌లో ఆమె లుక్, పాత్ర డిజైన్ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. ఒకవైపు సంప్రదాయ పల్లెటూరి అమ్మాయిలా లంగా ఓణీలో కనిపిస్తూనే, మరోవైపు కథ డిమాండ్ మేరకు బోల్డ్ షేడ్స్ ఉన్న సీన్స్‌లోనూ ఆమె కనిపించడం హైలైట్‌గా నిలిచింది. ముఖ్యంగా రొమాంటిక్ సీన్స్, లిప్‌లాక్ షాట్, చివర్లో రౌడీలకు ఎదురెళ్లే ధీటైన ఎక్స్‌ప్రెషన్స్ చూస్తే, ఫరియాను ఇప్పటివరకు చూసిన ఇమేజ్‌కు పూర్తిగా భిన్నంగా చూపించారని చెప్పొచ్చు.కంటెంట్ బలంగా ఉంటే గ్లామర్ రోల్స్ చేయడంలో తనకు ఎలాంటి అభ్యంతరం లేదని ఫరియా ఇప్పటికే పలుమార్లు చెప్పింది. అదే మాటకు తగ్గట్టుగానే రూరల్ డ్రామాలో ఆమె పాత్రను డిజైన్ చేసినట్లు టీజర్ ద్వారా అర్థమవుతోంది. గ్లామర్‌ను మాత్రమే కాకుండా, ఎమోషన్, ఆగ్రహం, అమాయకత్వం అన్నీ కలిపిన పాత్రగా ఇది కనిపిస్తోంది. ఈ సినిమాలో ఆమెకు నటన పరంగా కూడా మంచి స్కోప్ ఉన్నట్టు టీజర్ స్పష్టంగా చెబుతోంది. ఒకవైపు పల్లెటూరి అమ్మాయి అమాయకత్వం, మరోవైపు ధైర్యంగా నిలబడే మహిళగా ఆమె చూపించబోయే షేడ్స్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉన్నాయి.జిజి విహారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాతో ఫరియా మళ్లీ ఫామ్‌లోకి వస్తుందా లేదా అన్నది చూడాలి.

# చిత్రపరిశ్రమలో సెక్స్ వేధింపులు

## తమ్మారెడ్డి వ్యాఖ్యలతో కుదుపు

చిత్రసీమలో మరోమారు క్యాసింగ్ కౌచ్ దుమారం రేపుతోంది. తాజాగా నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ చేసిన వ్యాఖ్యలు ఒక్కరిగా చిత్ర పరిశ్రమను కుదిపేశాయి. క్యాస్టింగ్ కౌచ్ లేదని చిరంజీవి అనగనే, గాయని చిన్మయి ఉందనేశారు. 'కాస్టింగ్ కౌచ్' లేదని మెగాస్టార్ చిరంజీవి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై సీనియర్ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇండస్ట్రీలో వేధింపులు లేవని కొట్టిపారేయలేమని ఆయన స్పష్టం చేశారు. అంతే కాదు ఒకప్పుడు జమీందారులు, రాజులు కేవలం అమ్మాయిలను అనుభవించడానికే సినిమాలు తీసేవారని, ఆ పరిస్థితి ఇప్పటికీ కొందరిలో కొనసాగుతోందని ఆయన కుండబద్దలు కొట్టారు. ప్రస్తుతం ఏడాదికి 200 సినిమాలు వస్తున్నాయని, అందులో కొందరు ఎందుకు సినిమాలు తీస్తున్నారో వాళ్లకే తెలియదని.. కేవలం అమ్మాయిలను లోబర్చుకోవడానికే అలాంటి వారు ఇండస్ట్రీలోకి వస్తుంటారని తమ్మారెడ్డి విమర్శించారు. అయితే, సీరియస్‌గా సినిమాలు తీసే పెద్ద దర్శకులు, నటులు



వీటికి దూరంగా ఉంటారని ఆయన అభిప్రాయపడ్డారు. గాయని చిన్మయి గురించి మాట్లాడుతూ.. ఆమె వేధింపులపై పోరాడితే నిషేధం విధించడం దారుణమని, ఆమెను చూసి మహిళలు స్ఫూర్తి పొందాలని సూచించారు. పరిశ్రమలో వేధింపులు ఉన్న మాట వాస్తవమే అని, కానీ టాలెంట్ ఉంటే ఎవరూ తొక్కలేరని ఆయన పేర్కొన్నారు. ఎవరికైనా సమస్య వస్తే తాము అండగా ఉంటామని, అందరం కలిసి ఈ సమస్యను పరిష్కరించాలని ఆయన పిలుపునిచ్చారు.

Eekalam News, printed and published by Devender Nukala, eekalam publications, printed at sunday printing press, h.no.361, bhagyalaxmi colony, medchal malkaj-giri, telangana 500054. Editor : Devender Nukala. eekalamnews@gmail.com, RNI(PRGI) No.TGTEL/25/A3149